క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: ఐడీఏ జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ వెంకట నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవి ఏపీఐఐసీకాలనీ ఫీడర్, 33బై11కేవీఎస్ఎస్1 సెక్షన్ పరిధిలో మెయింటనెన్స్ పనులు ఉన్నందున ఏపీఐఐసీ కాలనీ, కళావతినగర్, సంజయ్‌గాంధీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

ఈటలను కలిసిన బీజేపీ నేతలు



నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



విద్యార్థులతో సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్

దుండిగల్: ప్రతి ఒక్కరికి న్యాయం పొందే హక్కు ఉంటుందని మేడ్చల్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ అన్నారు. మేడ్చల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో దుండిగల్‌లోని స్ఫూర్తి మోడల్ స్కూల్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అజయ్‌కుమార్, 10వ ఎంఎం న్యాయమూర్తి పార్థసారథి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానాలు చెప్పారు. మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పవన్‌కుమార్ పాలకుర్తి, జనరల్ సెక్రటరీ వి.విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు దశరథ, స్టాలిన్ బాబు, హనుమంతు, మహేందర్ దుందిగాళ్ల, హరీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం



కట్టమైసమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధి పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి, శైలజారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే గణపతి పూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, 108 కళశాలతో మహాకుంభాభిషేకం, అమ్మవారికి లక్షపార్చన, ఆదివారం రోజు చండీ హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. శుక్రవారం పెద్ద ఎత్తున మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మేడ్చల్ డివిజన్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో యశోద ఆస్పత్రి సహకారంలో శుక్రవారం విద్యుత్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మేడ్చల్ డివిజన్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన శిబిరాన్ని ప్రారంభించగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం విషయంలో సైతం సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. ఈ శిబిరంలో మేడ్చల్ సర్కిల్ టెక్నికల్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీలు, ఏఈలు, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ పాల్గొన్నారు.

‘మధ్యాహ్నం’లో పౌష్టికం మాయం

- ప్రభుత్వ పాఠశాలల్లో గాడితప్పిన మధ్యాహ్న భోజనం
- పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు.. బిల్లుల జాప్యం
- విద్యార్థులకు పౌష్టికాహారం అందకపోవడంతో ఆందోళన

ధరలు పెరిగే.. మెనూ అమలు భారమాయే..!



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు గాడి తప్పుతోంది. పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు, బిల్లుల చెల్లింపుల జాప్యంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో కొత్త మెనూను అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలు కూడా అమలు కావడం లేదు. కోడిగుడ్ల ధరలు పెరగడంతో వాటిని విద్యార్థులకు పెట్టడం లేదు. ఉడికీ ఉడకని అన్నం, రుచించని కూరలతో భోజనం చేసేందుకు విద్యార్థులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దాదాపు 5 నెలల బిల్లులకు సంబంధించిన రూ.59 లక్షలతోపాటు గౌరవ వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇటీవల రెండు నెలల బిల్లులు మంజూరైనా.. కార్మికులకు చేరలేదని తెలుస్తోంది. ప్రభుత్వం కార్మికులకు పెంచిన గౌరవ వేతనాలు అమలు కావడంలేదు. అప్పు చేసి వంట చేస్తున్నా.. బిల్లులు చెల్లించడం లేదంటున్నారు. గతేడాది డిసెంబరు నుంచి కార్మికుల గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉంది.

వంట గది లేక..

మేడ్చల్ జిల్లాలో పలు బస్తీ పాఠశాలల్లో వంట గదులు సరిపోక ఆరుబయట వంటలు చేస్తున్నారు. కట్టెల పొయ్యిలపై చేస్తున్న వంటతో అన్నం ఉడకడం లేదని, కడుపునొప్పి వస్తోందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇక పెరిగిన ధరలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులతో కొత్త మెనూ అమలు చేయడం లేదని వంట కార్మికులు చెబుతున్నారు. రూ.5 చొప్పున కోడిగుడ్డు ధర ప్రభుత్వం చెల్లిస్తుండగా, మార్కెట్‌లో ప్రస్తుతం దాని ధర రూ.7 పలుకుతుందన్నారు. వాటిని కూడా అందించడం లేదని చెబుతున్నారు. దీంతో కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టడం లేదని తెలుస్తోంది. తక్కువ ధరలో దొరికే ఒకే రకం కూరగాయలతో వంట చేయడంతో రుచించడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఆర్థిక భారం..

కొత్త మెనూను అమలు చేయడం లేదు. తక్కువ ధరలతో దొరికే వంకాయ వంటి కూరలతో భోజనం పెడుతుండటంతో రుచిగా ఉండటం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. కొత్త మెనూ అమలుతో మరింత ఆర్థిక భారం పడుతుందని, ఈ క్రమంలో దాన్ని అమలు చేయడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు పలువురు తెలిపారు. నిత్యావసర ధరలు పెరగడం, పాత బిల్లులు నెలల తరబడిగా రాకపోవడంతో అప్పు చేసి భోజనం పెడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలు

కుత్బుల్లాపూర్: గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం ప్రగతియాత్రలో భాగంగా ఆయన గాజులరామారం డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్–ఏ, బీలలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలతో పాటు విద్యుత్ కేబుళ్లను మార్చాలని బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం అప్పల నాయుడు, బీఆర్ఎస్ నాయకులు రషీద్ బేగ్, అంజన్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

- సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు రూ.21 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



షాపూర్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

రంగారెడ్డినగర్: కార్మికులకు కనీస వేతనాలను వర్తింపజేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, కమిటీ సభ్యుడు లక్ష్మణ్‌లు హెచ్చరించారు. శుక్రవారం కార్మికులకు 73 షెడ్యూల్ కింద కనీస వేతనం రూ.26 వేలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమ యజమానుల ఒత్తిళ్లకు తలొగ్గి జీవోలను సవరించకపోవడంతో కార్మికులు గత 15 సంవత్సరాల నుంచి ఇబ్బంది పడుతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానంటినా జీతాలు పెరగడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులను ప్రభుత్వం పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ ఇవ్వకుండా యాజమాన్యాలు వారిని మోసం చేస్తున్నాయి. 1979 అంతర్రాష్ట్ర కార్మికుల చట్టం ప్రకారం వారికి అన్ని చట్టబద్ధ సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే అసెంబ్లీని ముట్టడించి ప్రభుత్వాన్ని దించుతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవదానం, కరుణాకర్ మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి



జగద్గిరిగుట్ట కూరగాయల మార్కెట్ వద్ద నిరసన తెలుపుతున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి, కాంగ్రెస్ నేతలు

జగద్గిరిగుట్ట: నిత్యావసరాలు ధరలు ఆకాశానంటి పేద, మధ్య తరగతి పనులు ఇబ్బందులు పడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం దళారులకు తొత్తుగా మారిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు పెరిగాయని అన్నారు. పెరిగిన ధరలను రాష్ట్ర ప్రభుత్వం అదుపు చేయాలన్నారు. సబ్సిడీపై ప్రజలకు వాటిని అందించాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు లాల్ మహమ్మద్, గఫర్, మండవ శివకుమార్, దండే రాజు, శ్రీనివాస్‌గౌడ్, అన్వర్, జలీల్, మహేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ధనలక్ష్మి, సరిత, లత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ప్రణీత్, వెంకట ప్రణీత్, ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

- విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇందిరమ్మ కాలనీ, సాయికృష్ణా కాలనీ, రుద్రా విల్లాస్, కేజీఆర్ ఫంక్షన్‌హాలు వెనుక ప్రాంతం, మనం ఫార్మసీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బంగారు మైసమ్మకు ఎమ్మెల్సీ పూజలు



ఎమ్మెల్సీని ఆశీర్వదిస్తున్న పూజారులు

కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట బంగారు మైసమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు.

బోనాలు సమర్పించిన జలమండలి ఉద్యోగులు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ డివిజన్ కార్యాలయంలో జీడిమెట్ల సెక్షన్ మేనేజర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళా సిబ్బంది అమ్మవారికి బోనాల సమర్పించి మొక్కలు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు విష్ణు ప్రసాద్, రాజేష్, ఆఫీసర్స్ విజయ రాధిక, రాంచందర్, రాములు, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్నాథ్, యూనియన్ లీడర్లు రాజిరెడ్డి, సురేష్ రెడ్డి, సెక్షన్ మేనేజర్లు విష్ణు ప్రసాద్, రోహిణి, రమ్య భారతి, అనూష, ఝాన్సీ, రవి, జలమండలి కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీల్లో నాసిరకం ఆహారం ఇస్తున్నారు’



కోడి గుడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు మల్లారెడ్డి

సుభాష్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సూరారం డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పిల్లలతో సరదాగా గడిపిన ఆయన గర్భిణుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న కోడి గుడ్లు చిన్నవిగా ఉండటాన్ని ఆయన ఆక్షేపించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి, జిల్లా ఓబీసీ నాయకులు సుశాంత్, సంగీత పాత్ర, డివిజన్ అధ్యక్షుడు జీడిమెట్ల పులి బలరామ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేశ్ మిశ్రా, జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్, దీపక్ అంబేకర్, అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ శ్రీధర్‌వర్మ తదితరులు ఉన్నారు.

నేడు చలో ఉస్మానియా

కూకట్‌పల్లి: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్‌తో ఈనెల 15వ తేదీన చలో ఉస్మానియా మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాక్ పేర్కొంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం జేఎన్‌టీయూహెచ్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు సంఘం సభ్యులు ఆవిష్కరించారు.

చేతివృత్తిదారులకు ఆర్థికసాయం అందించడంలో వివక్ష

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: చేతివృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంలో వివక్ష చూపుతోందని... ఈ పథకాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 300 మందికి మాత్రమే పరిమితం చేసిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ మండిపడ్డారు. గాజులరామారంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు పేరిట దళితులను మోసం చేసినట్టే, కులవృత్తిదారులకు ఆర్థిక సహాయం పేరిట బీసీలను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది మంది దరఖాస్తులు చేసుకుంటే, కేవలం 300 మందికే పరిమితం చేయడం దారుణమన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం ఇప్పించుకొనే పనిలో ఉన్నారని ఆరోపించారు. అర్హులైన బీసీ వర్గాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.
- బీసీ కులాలలోని అర్హులైన వారికి కాకుండా బీఆర్ఎస్ నాయకులకు ఆర్థిక సాయం అందితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు బావిగడ్డ రవి, డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, నాయకులు నర్సింగరావు, మురళీకృష్ణ, ముప్పిడి రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయానికి వచ్చి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి ఆయన అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో కోట్లాది రూపాయల పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజల సహకారం ఉంటే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు.

వైభవంగా దుర్గామాత మహంకాళి వార్షికోత్సవం



దుర్గామాత, మహంకాళి అమ్మవార్ల పూజల్లో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని దుర్గామాత మహంకాళి వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. జల్దా కుమార్ మంజుల, బైరి ప్రశాంత్ శ్రీవిద్య దంపతుల ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. రాత్రి 9గంటలకు దుర్గామాత అమ్మవారి కల్యాణం కనులపండువగా జరిగింది. అదే విధంగా ఆదివారం సాయంత్రం 5గంటలకు అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మణ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఫైనాన్స్ వ్యాపారుల వద్ద అప్పు తీసుకుని చెల్లించకపోవడంతో వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈనెల 13వ తేదీన లక్ష్మణ్ తన భార్యకు ఫోన్ చేసి ఫైన్సాన్ వాళ్లు డబ్బులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పాడు. తన సార్ వద్ద తీసుకుంటానని చెప్పింది. రాత్రి వరకు భర్త ఇంటికి రాకపోవడంతో అతని మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని కోసం వెతకగా శుక్రవారం మైసమ్మగూడలోని కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే కుత్బుల్లాపూర్‌ను అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సమస్యల పరిష్కారమవుతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, దత్తాత్రేయనగర్‌లలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించగా రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలు ఎవరూ సంతోషంగా లేరన్నారు. చింతల్ మార్కెట్ రోడ్డులో ఉన్న నాలా పనులు రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. అంబేద్కర్‌నగర్‌లో ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొత్తం వ్యర్థాలతో నిండిపోయాయని తెలిపారు. శ్రీరామ్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, దత్తాత్రేయనగర్‌లో సీసీ రోడ్లు మరమ్మతులు నోచుకోవడం లేదన్నారు. గణేశ్‌నగర్‌లో నాలా పనులు మంజూరైనా ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, అతని బంధువులే ఇక్కడ పదవులు అనుభవిస్తున్నా డివిజన్ ఇంకా అభివృద్ధికి నోచుకోవట్లేదన్నారు. దీనికి ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కుత్బుల్లాపూర్ డివిజన్, నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు సదానందం, కుత్బుల్లాపూర్ ఏ-బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ఇంచార్జ్ ఇరుగు రాధాకృష్ణ, సేవాదళ్ చైర్మన్ బండ నవీన్, సోషల్ మీడియా కన్వీనర్ భీమ్‌రావు, అరుణ, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి, దూలపల్లి కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్, నాయకులు ఖాజా భాయ్, జలీల్ ఖాన్, ఆర్కల విజయ్ గౌడ్, మహమ్మద్ ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని... ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్‌కు చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, వంటింటి గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే అందిస్తామన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, టేకుల ప్రవీణ్‌రెడ్డి, శ్రీశైలం, మధుసూదన్‌రెడ్డి, జీతయ్య, సత్తిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రఫాత్, ప్రవీణ్, అంజాద్, ఎం.ఎస్ చౌదరి, సన్నీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.